క్లుప్తంగా

పరామర్శ



తవుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలస గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవా తవుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం గుజ్జింగివలస గ్రామానికి వెళ్లి తవుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తవుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ తరుపున అండగా ఉంటామని మృతుడి కుటుంబ సభ్యులకు జెడ్పీ చైర్మన్ హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని కోమలిని అభినందిస్తున్న పీడీ చంద్రశేఖర్

జామి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–17 బాస్కెట్ బాల్‌పోటీలకు జామి ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.కోమలి ఎంపికైందని ఆ పాఠశాల పీడీ చంద్రశేఖర్ తెలిపారు. కొత్తవలసలోని జిందాల్ భారత్ పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కోమలి ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థినిని హెచ్‌ఎం రెహమాన్, పీడీ చంద్రశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వెటర్నరీ కళాశాల విద్యార్థులు, జాతీయసేవా పథకం వలంటీర్లు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ అన్నారు. గరివిడి శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. నిర్మాణంలో ఉన్న కళాశాల ప్రధాన భవనాన్ని, పశుగణన క్షేత్ర భవనాన్ని, బాలురు, బాలికల వసతి గృహాలను పరిశీలించారు.బోధన,బోధనేతర సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో మొక్కలు నాటారు. కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, అధ్యాపక సిబ్బంది సుధారాణి, షేక్ మస్తాన్‌బి, బి.ప్రకాశ్‌కుమార్, వై.ఆర్.అంబేడ్కర్, జి. ఎస్.హరిత, ఎస్.గంగునాయుడు పాల్గొన్నారు.

ఇది ప్రభుత్వ చేతకాని తనమే..



మాట్లాడుతున్న జైహింద్‌కుమార్

గంట్యాడ: రైతులకు ఎరువులు కూడా ఇవ్వలేక పోవడం కూటమి ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పొటాస్, యూరియా దొరక్క రైతుల ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేటు డీలర్లు కృత్రిమ సృష్టించి అధిక ధరకు విక్రయిస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకో వడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఎరువులు అందించలేని పక్షంలో రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు. ఎంపీటీసీ లెంకమోహన్‌రావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైతులకు కష్టాలు



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు కష్టాలు పడుతున్నారని ఎంపీపీ పొట్నూరు ప్రమీల ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడుతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఎరువులు అందజేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రైతులు ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు కొనాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల ఇసుక దొరక్క భవ న నిర్మాణాలు నిలిచిపోయాయని, పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చిరుద్యోగులను తొలగించడం తప్ప వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన ఘనకార్యాలు ఏమీ లేవని ఎద్దేవా చేశారు.

వేంకటేశ్వర స్వామీ.. చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించు

- తిరుమల లడ్డూను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు
- లడ్డూలో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించండి
- దేవదేవుని ప్రసాదం విలువ దిగజార్చారు
- పథకాలు అమలు చేయలేకే డైవర్షన్ పాలిటిక్స్
- చంద్రబాబు తీరుపై మండిపడిన మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాసరావు, అప్పలనరసయ్య
- వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు



ఎస్.కోట దేవి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

శృంగవరపుకోట: ఇచ్చిన హామీల మాటేమిటి అని అడిగితే అవి చెప్పకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు తిరుపతి లడ్డూలతో రాజకీయం చేయడం సీఎం చంద్రబాబుకే చెల్లిందని ఎస్. కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేలా, తిరుపతి లడ్డూ పవిత్రతను మంటగలిపేలా నీచ రాజకీయాలు చేస్తున్న సీఎం చంద్రబాబుకు, కూటమి నేతలకు సద్బుద్ధి ని ప్రసాదించాలని, చంద్రబాబు పాప ప్రక్షాలన కోసం వేంకటేశ్వర స్వామి, తదితర ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పూజలు చేశారు.ఎస్.కోట దేవీ ఆలయంలో, గాయత్రీదేవి ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేంకటేశ్వరస్వామికి మాజీ ఎమ్మెల్యే కడుబండి నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమల లడ్డూతో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని, నిజంగా లడ్డూల్లో నాణ్యత లేకపోతే దాన్ని పరిశీలించి చర్యలు తీసు కోవడానికి తిరుమలలో ప్రత్యేక వ్యవస్థ ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుపతికి సరఫరా అయిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో స్వచ్ఛత లేదని తిరుమల ఈఓ వెనక్కి పంపి స్తే.. దాన్ని గత ప్రభుత్వానికి, చైర్మన్‌లకు ఆపాదిస్తూ రాజకీయం చేయడమేంటని ప్రశ్నించారు. లడ్డూల తయారీలో జంతు వుల కొవ్వు కలిపారన్న ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు చేయించి, నిజమని తేలితే బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అలా చేయకుండా ఏ విచారణా జరగక ముందే లడ్డూల్లో కల్తీ జరిగిపోయిందని సీఎం నిర్ధారించేసి, ఇప్పుడు సిట్‌తో విచారణ చేయించడం దేనికంటూ ప్రశ్నించారు. అబద్ధాలు, దుష్ప్రచారాలతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దేవ దేవుడి ప్రసాదం విలువను ప్రపంచవ్యాప్తంగా దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాలు అమలు చేయలేకే లడ్డూల కల్తీ అంటూ చంద్రబాబు డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని ప్రజలకు అర్థమైం దని, దీంతో కొత్త వాదన ఎత్తుకుని మాజీ సీఎం జగన్ తిరుమల వెళ్తానంటే అడ్డకుని, డిక్లరేషన్ అడుగుతున్నారన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రుల హోదాలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకని నిలదీశారు. రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్.కోట, వేపాడ, ఎల్.కోట మండల అధ్యక్షులు మోపాడ కుమా ర్, మమ్ములూరి జగన్నాథం, ఒబ్బిన నాయుడు, ఎస్.కోట జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎంపీపీలు నీలంశెట్టి గోపమ్మ, గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, నాయకులు వాకాడ రాంబాబు, షేక్ రహ్మాన్, గొరపల్లి శివ, మేలాస్త్రి అప్పారావు, పల్లా భీష్మ, యడ్ల కిషోర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈ పాపం ఊరికే పోదు...



గజపతినగరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు నాయుడు నీచరాజకీయాలు చేస్తున్నారని, ఈ పాపం ఊరికే పోదని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డా రు. చంద్రబాబు పాప ప్రక్షాలన కోసం గజపతినగరం బజా రు వీధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శనివారం పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తయిందని, ఒక్క పథకం కూడా అమలు చేయలేకపోవడంతో ప్రజా వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో తిరుమల లడ్డూను రాజకీయాలకు వాడుకుంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. గతంలో లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిపోయిందంటూ చంద్రబాబునాయుడు,పవన్ కల్యాణ్,లోకేష్ పొంతన లేకుండా అవాస్తవాలు మాట్లాడుతూ పాపాన్ని మూటక ట్టుకుంటున్నారన్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనానికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లబోతే ఆంక్షలు విధించడం ఎంతవరకు సబబు అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు గతంలో ఆలయాలను కూలగొట్టిస్తే, జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎన్నో దేవాలయాలను నిర్మించారని గుర్తు చేశారు.వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ నాయకులు కరణం ఆదినారా యణ, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కనకల సుబ్రహ్మణ్యం, కడుపుట్ల పైడిపునాయు డు, బైరెడ్డి శ్రీను, కర్రి రామునాయుడు, మంత్రి నర్సింగరావు, చల్లా అర్జున్, ఏంద్రాపు రామునాయుడు, బి.వాసు తదితరులు పాల్గొన్నారు.

జిన్నాం గ్రామంలో..

జిన్నాం గ్రామంలోనివేంకటేశ్వర స్వామి ఆలయంలో జిన్నాం, రామన్నపేట, రంగుపురం,వేమలి,ఎం.కొత్తవలస గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు చేశారు. జిన్నాం గ్రామ మాజీ సర్పంచ్ యిజ్జిరోతు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నందిని పంది చేయగల సమర్థుడు చంద్రబాబు



దత్తిరాజేరు: దత్తి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు



గంట్యాడ: గంట్యాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

గంట్యాడ: నందిని పంది చేయగల సమర్థుడు సీఎం చంద్రబాబు అని జెడ్పీటీసీ వర్రినరసింహామూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ అన్నారు. తిరుపతి లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని గంట్యాడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, నాయకులు లచ్చిరెడ్డి కృష్ణ, కోడెల ముత్యాలనాయుడు, కోళ్ల కొండలరావు, చప్ప చిన్న, లెంక మోహన్‌రావు, విజయ్‌కుమార్, వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దేవుడితో రాజకీయాలు తగదు

జామి: దేవదేవుడు వేంకటేశ్వర స్వామితో రాజకీయాలు చేయడం తగదని, సీఎం చంద్రబాబు చేస్తున్న నీచరాజకీయాలను యావత్ ప్రపంచం చీకొడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పూజలు చేశారు. మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు,ఎంపీపీ సబ్బవరపు అరుణ, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి వైస్ ఎంపీపీలు ఎన్నింటి విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, నాయకులు చలుమూరి సత్యారావు,శీరెడ్డి చందునాయుడు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భక్తుల విశ్వాసంపై దాడి

గుర్ల: తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు భక్తుల విశ్వాసంపై దాడి చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు మండలంలోని కెల్ల శివాలయంలో నాయకులు కెల్ల సురేష్, కెల్ల పైడిరాజు, తదితరులు శనివారం పూజలు చేశారు.



జామి: భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న నాయకులు

మనోభావాలు దెబ్బతీశారు..

బొండపల్లి: తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడరంటూ అనవసర రాద్ధాంతం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని కోరుతూ బోడసింగిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎంపీపీ చల్లా చల్లంనాయుడు, నాయకులు శనివారం పూజలు చేశారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాషరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డల చిన్నంనాయుడు, నాయకులు మీసాల తులసి, మహంతి రమణ, జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మతిస్థిమితం లేదు

దత్తిరాజేరు: మతిస్థిమితం లేక తిరుమల లడ్డూ ప్రసాదంపై రాజకీయం చేస్తున్న సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించమని వేడుకుంటూ దత్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పూజలు చేశారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు,మిత్తిరెడ్డి రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, నాయకులు మంత్రి అప్పలనాయుడు, సుమల శ్రీను, మండల శ్రీను, ఫణీంద్రుడు.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: కెల్ల శివాలయంలో పూజలు చేస్తున్న నాయకులు



గజపతినగరం: జిన్నాం వేంటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

వ్యవసాయ మోటార్ల ప్రారంభం



మోటార్లను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో 24 మంది రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ బోర్లు తవ్వించి, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసింది. ఆ బోర్లలో అమర్చిన వ్యవసాయ మోటార్లను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు గతంలో గుజ్జింగివలస రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని, వారి విజ్ఞప్తి మేరకు బోర్లు తవ్వించి, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. రైతులు జెడ్పీ చైర్మన్‌కు ధన్యావాదాలు తెలిపారు.జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, రెడ్డి మురళీధరరావు, అట్టాడ రామకృష్ణ, రెడ్డి అప్పలనరసయ్య, అట్టాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలు

మెరకముడదాం: స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఎంఈఓ– 2 టి.ధర్మశ్రీను ఆధ్వర్యంలో మండలస్థాయి ప్రతిభా పోటీలను శనివారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలికా సంరక్షణ, స్వర్ణాంధ్రప్రదేశ్– 2047 అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలకు పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. బాలిక సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో కేజీబీవీ విద్యార్థిని చెందిన ఎం.విజయలక్ష్మి ప్రథమ స్థానం, చిత్రలేఖనంలో బిళ్లలవలస ఉన్నత పాఠశాల విద్యార్థిని బురిడి మణిప్రియ ప్రథమస్థానంలో నిలిచారు. స్వర్ణాం ధ్ర–2047 అంశంపై వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో ఉత్తరావల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని రౌతు గిరీష్మ ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలు ఈనెల 30వ తేదీన విజయనగరం సాంస్కృత పాఠశాలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ– 2 ధర్మశ్రీను తెలిపారు. మెరకముడిదాం హైస్కూల్ హెచ్‌ఎం ఎల్లంనాయుడు, చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఆల్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎరువుల పంపిణీలో విఫలం

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: వ్యవసాయం దండగని గతంలో సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన మాటలనే నేటికీ ఆచరిస్తూ, రైతులను ఇబ్బందిపెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులు,విత్తనాల పంపిణీలోప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని విమర్శించారు. యూరియా, పొటాష్ లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలను గ్రామాల్లోనే అందించేవారమని గుర్తు చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం, ఇక్కడి మంత్రి పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

కేసులు నమోదు చేయడమేంటి..?

సీఎం చంద్రబాబు చెప్పే మాటలకు, చేస్తున్న పనులకు పొంతన ఉండదని అప్పలనరసయ్య ఆరోపించారు. వాగుల్లో, గెడ్డల్లోని ఇసుకను ఉచితంగా తెచ్చుకోవచ్చని, మిమ్మల్ని ఎవరు అడ్డారని చంద్రబాబు చెప్పిన మాటలను గుర్తు చేశారు. ఇప్పుడేమో వాగులు, గెడ్డల్లో ఇసుకను తెచ్చుకుంటున్న వారిపై కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక దొరక్క ఇళ్ల, భవన నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని చెప్పి ఇంటింటికీ అధికారులతో స్టిక్కర్లతో అతికించడం కాదని, దమ్ము, ధైర్యం ఉంటే టీడీపీ నాయకులు వెళ్లి స్టిక్కర్లు అతికించాలని సవాల్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకట రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, పైడిపునాయుడు, నారాయణమూర్తి,సుబ్రహ్మణ్యం, సూరినాయుడు, కామునాయుడు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జయంతి



చీపురుపల్లి: జి.అగ్రహారం పాఠశాలలో భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని జి.అగ్రహారంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఎస్.కోట డిగ్రీ కళాశాలలో..

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం నేతృత్వంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు, అధ్యాపకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

చీపురుపల్లి: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించిన పనులను లబ్ధిదారులు తక్షణమే ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు సూచించారు.మన ఇల్లు–మనగౌరవం కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి సచివాలయం–2లో హౌసింగ్‌శాఖ నేతృత్వంలో సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరవుతాయని చెప్పారు.

నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు

దత్తిరాజేరు: గత ప్రభుత్వంలో మంజూరై, మధ్యలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేస్తే వెంటనే బిల్లులు చెల్లిస్తామని మండల ప్రత్యేక అధికారి జోషెఫ్ తెలిపారు. మన ఇల్లు–మనగౌరవం కార్యక్రమంలో భాగంగా ఎస్.చింతలవలసలో గృహ లబ్ధిదారులతో హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన 125 ఇళ్లలో ఇప్పటికే 68 శాతం ఇళ్ల నిర్మాణలను లబ్ధిదారులు పూర్తి చేశారని, మిగిలిన వాటిని పూర్తి చేస్తే మంచి కాలనీ నిర్మించామనే గుర్తింపు ఉంటుందని సర్పంచ్ కంది పద్మావతి అన్నారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ కంది తిరుపతినాయుడుపాల్గొన్నారు.



గజపతినగరం: మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ సత్యనారాయణ

త్వరగా పూర్తి చేయాలి

గజపతినగరం: గత ప్రభుత్వంలో మంజూరై ఇంకా నిర్మాణాలను పూర్తి చేయని లబ్ధిదారులంతా 2025 మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ మరడాన సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మన ఇల్లు –మనగౌరవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు మంజూరు చేయిస్తామన్నారు. డీటీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమణ, స్థానిక పెద్దలు గోపాలరాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



వ్యాయామ ఉపాధ్యాయిని విజయశాంతిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

శృంగవరపుకోట: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న స్థానిక బాలికోన్నత పాఠశాల పీడీ ఎస్.విజయశాంతి, వేపాడ మండలంలోని దబ్బి రాజుపేట ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం రెడ్డి శంకరరావును పీఆర్టీయూ నాయకులు శనివారం సన్మానించారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, ఉపాధ్యక్షు డు ఇందుకూరి అశోక్‌రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్రి మోహన్‌రాజు, అల్లు సురేష్, జిల్లా కార్యదర్శి కె.బంగారునాయుడు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు గొల్లు సూరిబాబు, టి.అప్పారావు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం

మెరకముడిదాం: పుస్తకపఠనంతో విజ్ఞానం, ఏకాగ్రత పెరుగుతుందని చీపురుపల్లికి చెందిన ఆశయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రెడ్డి రమణ అన్నా రు. యాడిక గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆశయ రూరల్ మొబైల్ లైబ్రరీని విద్యార్థులకు శనివారం అందుబాటులో ఉంచారు. పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వారితో పుస్తకపఠనం చేయించారు.

ఘనంగా జాషువా జయంతి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వ హించారు.జాషువా చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్స్‌పాల్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలి

గంట్యాడ: ఖరీఫ్ పంటల సాగు వివరాలను రైతులు తక్షణమే ఈ–క్రాప్‌లో నమోదు చేసుకుని ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు సూచించారు.మండలంలోని బుడతానపల్లి గ్రామంలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. గ్రామంలో ఇంత వరకు ఎంతమంది రైతులు ఈ– క్రాప్ నమోదు చేసుకున్నారు, ఇంకా ఎంత మంది మిగిలి ఉన్నారని వీఏఏను అని అడిగితెలుసుకున్నారు. ఒకటి, రెండు రోజుల్లో శతశాతం పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఓ శ్యామ్‌కుమార్ ఉన్నారు.

టీఎల్‌ఎం చార్టులు ఏర్పాటు చేయండి

వేపాడ: తరగతి గదుల్లో టీఎల్‌ఎం గోడ చార్టులను ఏర్పాటు చేయాలని ఎంఈఓ జగదీశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. బొద్దాం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు, వర్క్ బుక్‌లను పరిశీలించి, విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన వంటలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

భూముల వివరాలను ఆన్‌లైన్ చేయండి

వేపాడ: మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన పలువురు రైతులు తాము సాగు చేసుకుంటున్న భూములను తమ పేరుమీదుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ తహసీల్దార్ సన్యాసినాయుడుకు శనివారం వినతిపత్రం అందజేశారు. గుడివాడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సుమారు 16 ఎకరాల భూమిని దశాబ్దాలుగా గ్రామ పురోణీ ద్వారా సాగు చేసుకుంటున్నామని రైతులు వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో ఆభూమి తమ పేరునే నమోదైందని, శిస్తు కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. కొందరు ఆ భూములు తమవే అంటూ భయపెడుతున్నారని, వాటిని ఆన్‌లైన్‌లో సాగు దారుల పేరిట చేయించాలని కోరారు.

చెడు వ్యసనాలతో నాశనం

చీపురుపల్లిరూరల్(గరివిడి)/ జామి: చెడు వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని గరివిడి, జామి ఎస్‌ఐలు బి.లోకేశ్వరరావు, వీరజనార్దన్ విద్యార్థులకు సూచించా రు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై గరివిడిలోని వేద కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఐ లోకేశ్వరరావు,జామి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఐ వీరజనార్దన్ శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషిచేయాలని దిశా నిర్దేశం చేశారు. డ్రగ్స్ తీసుకోవడం, మద్యంతాగడం లాంటి చెడు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. ర్యాగింగ్ వంటి కార్యక్రమాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదన్నారు.